


## చిన్నమాట

*కథ అందరికీ నచ్చే సాహిత్య ప్రక్రియ. బాల్యం నించే మనిషికి కథలంటే ప్రీతి. అందుకే తెలుగులో వార, మాసపత్రికల్లో కథలు తప్పనిసరి. ఆఖరికి ఆదివారం అనుబంధాల్లో కూడా. కథా సరిత్సాగరం, కాశీ మజలీ కథలు, పంచతంత్రం కథలు.... ప్రతి సంస్కృతికీ ఇలాంటి కథలున్నాయి. తెలుగు కథల నేపథ్యానికి విస్తృతి లేదు. ఈనాటికీ అవి ఎదగలేదు. ప్రేమ, కుటుంబం, జానపదం, హాస్యం, ఇంకా ఆఫీసు కథలు, కమ్యూనిస్ట్ కథలు, తెలుగు కథలు ఇలా కేవలం  పరిమిత ఇతివృత్తాల చుట్టూనే తిరుగుతున్నాయి.*

*కమ్యూనిజం, స్త్రీవాదం, దళితవాదం కథలని అతి గొప్ప కథలుగా చలామణి చేసే ప్రయత్నం  కొన్ని పదుల సంవత్సరాలుగా జరుగుతోంది. కథల పోటీల్లో అవార్డులుకూడా ఈ కథలకే వస్తూండడం కూడా మనం గమనించవచ్చు. ఈ మధ్య యువరచయితలనుంచీ స్వలింగ సంపర్కం లాంటి జుగుప్సాకరమైన కథలు కూడా వస్తున్నాయి.*

*తెలుగులో ఆ950–ఆ960లలో వెలువడ్డ కథలు ఈనాటికీ గుర్తుండిపోయే మంచి కథలు. ఆనాటి రచయితలు ఏ వాదానికీ కట్టుబడకుండా మానవ జీవితాల్లోని సున్నిత అంశాలతో కథలు రాసారు.*

*విదేశాల్లో, ముఖ్యంగా అమెరికా, యూరప్‌లలో కథా ఇతివృత్తం ఎంతో విస్తృతమైందని వారి పత్రికలు చదివాక నాకు అర్థమైంది. విపుల మాస పత్రిక ఆరంభించినప్పటినించి నేను వాటిని తెలుగులో అనువదిస్తున్నాను.*

*చిన్నప్పటినించి నాకు క్రైం కథలంటే ఇష్టం. ఆ రకం కథల ఇతివృత్తాలు కూడా ఎంతో విస్తృతమైనవి. హత్య, పరిశోధనే కాకుండా లాక్డ్ రూమ్ మిస్టరీస్, పజిల్స్, అతీంద్రియ కథలు, ట్విస్ట్ కథలు, హాస్యం, చరిత్ర, జానపద నేపథ్యం, కిడ్నాపింగ్, పగ, ప్రతీకారం, బ్లాక్ మెయిలింగ్ కథలు ఇంకా కిరాయి హంతకులు, వృద్ధులు, పిల్లలు, జంతువులు ప్రధాన పాత్రలుగాగల కథలు, రోడ్ కథలు, హృదయాన్ని స్పందింపచేసే కథలు... ఇలా వాటిలో ఎన్నో డివిజన్స్ ఉన్నాయి.*

*అలాంటి కథలని తెలుగు పాఠకులు ఈ నెలనించి కౌముదిలో నెలకి ఒకటి చదవగలరు. తెలుగు కథా వీధుల్లో లభ్యం కాని ఈ వినూత్న కథలు మిమ్మల్ని ఆనందింప చేస్తాయని ఆశిస్తూ ...*

*మీ మల్లాది వెంకట కృష్ణమూర్తి.*

# ప్రేమంటే...
# { డేవిడ్ కె హర్‌ఫోర్ట్ కథకి స్వేచ్ఛానువాదం}

**ఫీబర్ జువెలరీ స్టోర్స్‌లోకి** వచ్చిన కెప్టెన్ క్రాఫ్ట్, మిస్టర్ ఫీబర్ని ప్రశ్నించడం రోజ్ గమనించింది. ఇలా ప్రశ్నించడాన్ని ఆమె సిన్సినాటీలో, నార్‌ఫోర్క్‌లో కూడా గమనించింది. మిసెస్ విట్కిన్స్ వజ్రాల దొంగతనం గురించి ప్రశ్నించడానికే కెప్టెన్ వచ్చాడని రోజ్ ఇట్టే గ్రహించింది. రోజ్ స్టోర్‌లోని అద్దాల షోకేస్‌లని తుడుస్తూ ఓ కంట వారిని గమనించసాగింది. మిసెస్ విట్కిన్స్ తెగిన వజ్రాల గొలుసుని బాగు చేయడానికి ఇచ్చింది. ఆ వజ్రాలు మాయమయ్యాయని గుర్తించి ఫీబర్ పోలీసులకి ఫిర్యాదు చేసాడు. వెంటనే కెప్టెన్ క్రాఫ్ట్ వచ్చాడు.

ఆ రాత్రి రోజ్ తన ఇంట్లో సింక్‌లోని మురికి నీళ్ళని చూసి విసుక్కుంది. తను దొంగిలించిన ఆ వజ్రాలని ఎవరికి అమ్మాలి? శాక్రిమెంటోలో ఐతే ఫ్రాన్స్ కొనేవాడు. ఈ కొత్త ఊళ్ళో ఇంకా ఎవరూ తెలీదు. పోలీసులకి వాళ్ళు దొరికిపోతే తన గురించి చెప్పకూడదు. అలాంటివారికే అమ్మాలి. చాలామంది దొంగలు దొంగ సరుకు కొన్నవారి వల్లే పట్టుబడుతూంటారని రోజ్ నమ్మకం. అందుకే ఆ విషయంలో జాగ్రత్తగా ఉంటుంది. బోస్టన్‌కి తీసుకెళ్ళి అమ్మితే మంచిది అనే ఆలోచన కూడా రోజ్‌కి కలిగింది.

డోర్‌బెల్ మోగింది. ఆ సమయంలో ఎవరూ రారు. చేతులు తుడుచుకుని వెళ్ళి తలుపు తెరిచింది. ఎదురుగా ఇంటావిడ. ఆవిడ పక్కన నిలబడ్డ కెప్టెన్ క్రాఫ్ట్‌ని చూసి ఆశ్చర్యాన్ని, భయాన్ని అణచుకుంది. పక్కన మరొకరు చేతిలో ఏదో యంత్రంతో నిలబడి ఉన్నరు.

"ఎస్?" అడిగింది.

"మీరు పనిచేసే షాప్‌లో మిసెస్ విట్కిన్స్ వజ్రాలు మాయమయ్యాయని తెలుసుగా. మీ అపార్ట్‌మెంట్‌ని వెదకడానికి కోర్ట్ ఆర్డర్ తీసుకుని వచ్చాను. మీరు దొంగని అనుమానంతో కాదు. ఇది మా పరిశోధనలో రొటీన్‌గా జరిగేది మాత్రమే" కెప్టెన్ చెప్పాడు.

"సరే, రండి" నవ్వుని నటిస్తూ చెప్పింది.

"ఇతను మా టెక్నీషియన్. ఈ యంత్రంతో మా పని తేలికవుతుంది. వజ్రాలున్న చోట ఇది మోగుతుంది" కెప్టెన్ చెప్పాడు.

అతను లోపలికి వెళ్ళి ఆమె మంచం దగ్గర దాన్ని స్విచాన్ చేసి, దానికి ఆరంగుళాల వ్యాసంలో గల చక్రాన్ని మంచమ్మీద పరుపుకి ఆనించి పోనించాడు. ఆ పరికరం ఆన్ చేయగానే చెవి దగ్గర ఎగిరే దోమలా వింత శబ్దం

చేయసాగింది. రోజ్ నిస్సహాయంగా ఓ కుర్చీలో కూర్చుండిపోయింది. సింక్ కింద జాయింట్‌లో వాటిని తను దాచింది. ఇల్లంతా తిరిగి చూసిన ఇంటావిడ మౌనంగా వెళ్ళిపోయింది.

"మిసెస్ విట్కిన్స్ తెగిన గొలుసు చుట్టమని ఇరవై ఐదు వజ్రాలని ఇచ్చింది. మర్నాడు మీ యజమాని చూస్తే అవి మాయమయ్యాయి. నా అనుమానం ఇది బయటివారి పనికాదు. బయటి దొంగలైతే మరికొన్ని నగలని కూడా తీసుకెళ్ళేవారు." కెప్టెన్ చెప్పాడు.

"నాతోపాటు మా షాపులో మరో ఇద్దరు పనిచేస్తున్నారు" గుర్తు చేసింది.

"వారిద్దరి ఇళ్ళని వెదికాకే మీ ఇంటికి వస్తున్నాం" కెప్టెన్ చెప్పాడు.

మంచాన్ని పరీక్షించాక ఆ టెక్నిషియన్ బాత్‌రూంలోకి వెళ్ళాడు. అకస్మాత్తుగా అరవై ఏళ్ళ మిస్టర్ క్రంబకుల్ బయటినించి వచ్చాడు.

"హలో మిస్ రోజ్" నవ్వుతూ పలకరించాడు.

"మీరెందుకు వచ్చారు?" రోజ్ అడిగింది.

"మీ కిచెన్ సింక్‌లోంచి నీళ్ళు పోవడంలేదని మీ ఇంటావిడ ఇప్పుడే చూసి నాకు ఫోన్ చేసింది. అదృష్టవశాత్తు నేను దగ్గర ఇంట్లోనే పని చేస్తున్నాను. ముందు నీ పని పూర్తి చేద్దామని అదాపి వచ్చాను."

రోజ్ గుండె గుభేలుమంది. నీళ్ళు పోకపోవడానికి కారణం తను దానికింద కనెక్షన్‌ని తొలగించి, వజ్రాల మూటని దాచి మళ్ళీ బిగించడం. ఇప్పుడు వీళ్ళముందు అది ఇతని కంట పడితే?

తెల్లజుట్టు. ముఖంలో స్వల్పంగా ముడుతలు గల క్రంబకుల్ ఇటీవల ఆదివారాలు కాలక్షేపానికి తన దగ్గరికి వచ్చి కబుర్లు చెప్తున్నాడు. ఆయనకి తనంటే ఇష్టమని ఎన్నో విధాలుగా మాటల్లో తెలియచేసాడు. క్రితం ఆదివారం ఇక రావద్దని గట్టిగా చెప్పింది. తను తనకన్నా మూడురెట్లు ఎక్కువ వయసున్నవారిని పెళ్ళి చేసుకోడానికి సిద్ధంగా లేదు.

"ఎమర్జెన్సీ కాల్స్‌ని నేను నిర్లక్ష్యం చేయను" చెప్పి ఆయన తన టూల్‌కిట్‌తో వంటగదిలోకి వెళ్ళాడు.

తనూ వంటగదిలోకి వెళ్ళడానికి రోజ్ లేస్తే కెప్టెన్ చెప్పాడు.

"దయచేసి కూర్చోండి. మా పని పూర్తయ్యేదాకా మీరు కదలకూడదు."

బాత్‌రూంలోంచి బయటికి వచ్చిన టెక్నీషియన్ కెప్టెన్ వంక చూసి, తల అడ్డంగా ఊపి ఆ గదిలోని షోకేస్, డ్రెసర్ మొదలైన ఫర్నిచర్‌ని పరీక్షించసాగాడు.

వంటగదిలో ఈలవేస్తూ మిస్టర్ క్రంబుల్ పనిచేయడం ఆమెకి వినిపిస్తోంది. పరికరాలని ఉపయోగించే చప్పుడు కూడా. రోజ్ కుర్చీలో శాంతిగా కూర్చోలేకపోయింది.

ఆయన తన భార్య మరణించి పదిహేనేళ్ళయిందని చెప్పాడు.

"నేను నా భార్యని ఎంతగా ప్రేమించానో నీకు తెలీదు మిస్ రోజ్" ఓ రోజు రుద్ధకంఠంతో చెప్పాడు.

ఆయన ఇద్దరు కొడుకులు కేలిఫోర్నియాలోనే ఉన్నారు. ఆయన్ని పట్టించుకోరు. చూడటానికి రారు. ఆయన తనని ప్రేమిస్తున్నాడని ఆమె నెమ్మదిగా గ్రహించసాగింది. ఐతే ఆయన తనని ముట్టుకునే ప్రయత్నం ఎన్నడూ చేయలేదు. ఆమెకూడా ఆయన్ని నిజంగానే ఇష్టపడింది. తనని ఇష్టపడే వ్యక్తిమీద కలిగే ఇష్టంలాంటిదే అది.

ఓరోజు ఆమె వీకెండ్ పికినిక్ నించి తిరిగి వచ్చేసరికి ఆమె పడక గది గోడలకి మాసిపోయిన పాత వాల్ పేపర్ స్థానంలో ఆకర్షణీయమైన డిజైన్ గల కొత్తది అతికించి కనబడింది. అది ఎవరి పనో ఇట్టే గ్రహించింది.

"ఓ పెద్ద ఇంట్లో పనిచేస్తున్నాను. అక్కడ మిగిలింది సద్వినియోగం చేసాను. మీ ఇంటి పాస్‌కీ నా దగ్గర ఉంది" ఆయనకి ఫోన్ చేస్తే నవ్వుతూ చెప్పాడు.

ఉత్త చేతులతో రాడు. ఆమెకి పూలగుత్తి, చాక్లెట్ పెట్టె, ఇంట్లో చేసిన బిస్కెట్స్ లాంటివి తెస్తూంటాడు.

ఓ రోజు మాటల్లో ఆయనకి నేరస్థులంటే గల అభిప్రాయం రోజ్‌కి తెలిసింది.

"నన్నడిగితే దొంగలకి యావజ్జీవ కారాగార శిక్షని విధించాలి. బయటికి వచ్చాక మళ్ళీ వాళ్ళల్లో తొంభై శాతం మంది చేసే పని అదే. జైళ్ళల్లోకి తిరిగేది వాళ్ళే. అమెరికాలో అర్ధరాత్రి ఒంటరిగా వీధుల్లో నడవడంలో బద్రత పూర్తిగా పోయింది."

కెప్టెన్‌లో ఆ వజ్రాలు ఆమె దగ్గరే ఉన్నాయని, వాటిని ఎలాగైనా కనుక్కోవాలనే పట్టుదల కనిపిస్తోంది. క్రాఫ్ట్ ఆమె హేండ్‌బేగ్‌ని, సూట్‌కేస్‌లని తెరిచి వెదికాడు. ఆమె దుస్తుల జేబులన్నీ కూడా వెదికాడు. రోజ్ మౌనంగా అతనివంకే చూస్తూ కూర్చుంది. 'ఇవిగో కెప్టెన్. ఇవేనా మీరు వెదికేవి?' అని మిస్టర్ క్రంబకుల్ ఏ క్షణంలోనైనా వంటగదిలోంచి బయటికి రావచ్చని రోజ్ భయాన్ని అణచుకుంటూ ఉత్కంఠంగా ఎదురు చూడసాగింది.

టెక్నీషియన్ తన పరికరంతో వంటగదిలోకి వెళ్ళాడు.

క్రంబుకుల్ చేతిలోని నేప్‌కిన్‌తో తుడుచుకుంటూ బయటికి వచ్చాడు. అతని భుజాన పరికరాల సంచి వేలాడుతోంది.

"మీరు వెదికేవి ఇవేనా?' అని ఆ వాక్యాన్ని కెప్టెన్‌వైపు తిరిగి పూర్తిచేస్తాడనుకుంది. కాని ఆయన రోజ్‌తో చెప్పాడు.

"మిస్ రోజ్. సింక్‌ని శుభ్రం చేసాను .ఇంకోసారి కిచెన్ సింక్ పాడైతే ఇంత త్వరగా రాను."

ఆయన బయటికి నడిచాడు. వజ్రాలు ఆయన కంటపడి ఉండాలి. ఆయన వాటిని దొంగిలించి తీసుకెళ్తున్నాడని రోజ్‌కి అర్ధమైంది. తను తెలుకుట్టి దొంగలా కిక్కురు మనదని క్రంబకుల్‌కి తెలుసు. రోజ్ మొహం కోపంతో ఎర్రబడింది.

"వంటగదిలో కూడా అవిలేవు" కొద్దిసేపటికి టెక్నీషియన్ బయటికి వచ్చి చెప్పాడు.

"వజ్రాలు దొరకలేదు. కానీ మీరు నన్ను దొంగని భావించారు. మీ తప్పుకి నేను క్షమాపణ ఆశించడం తప్పుకాదుగా?" రోజ్ నవ్వుతూ అడిగింది.

కెప్టెన్ క్రాఫ్ట్ కూడా నవ్వుతూ చెప్పాడు.

"సారీ మిస్ రోజ్. ఐ అపాలైజ్. కాని మీ ముగ్గురిలో ఎవరో వాటిని ఇంట్లో కాక మరెక్కడో దాచారని మాత్రం స్పష్టంగా తెలుసు. వాటిని కనుక్కొగలననే ఆశిస్తాను."

కెప్టెన్ తన మనషులతో వెళ్ళిపోయిన అరగంటకి డోర్ బెల్ మోగింది.

మళ్ళీ పోలీసులా? తలుపు తెరిస్తే ఇంటావిడ. లోపలకి వచ్చి కొద్దిసేపు వాళ్ళ అనుమానానికి వాళ్ళని తప్పు పట్టింది. ఆవిడ వెళ్ళిన కొద్దిసేపటికి మరోసారి రోజ్ బెల్ మోగింది. ఈసారి కూడా పోలీసులు కారు.

ప్లంబర్ క్రంబకుల్. ఆయన చేతిలో ఓ కేక్ ఉంది.

"ఓ! ఇంట్లో ఎవరూ లేరా? ఎవరైనా ఉండచ్చనుకుని కేక్ వండి తెచ్చాను. ఇది ఇంతదాకా నువ్వు చూసిన అన్ని కేక్స్‌లోకి అత్యంత ఖరీదైన కేక్ మిస్ రోజ్. నీకోసం ప్రత్యేకంగా వండి తెచ్చాను. తినేటప్పుడు నోట్లో ఏదైనా అడ్డుపడచ్చు. అది గొంతు దిగకూడదు. కాబట్టి జాగ్రత్త."

ఆయన పోలీసులు తొలగించిన కార్పెట్‌ని వంగి సరిచేసి బయటికి నడిచాడు.

"మిస్టర్ క్రంబకుల్."

ఆమె పిలుపు విని ఆగి వెనక్కి చూసాడు.

"మీకెలా థాంక్స్ చెప్పను. ఎందుకు? మీకు దొంగలంటే ద్వేషం కదా?" రుద్దకంఠంతో రోజ్ అడిగింది.

"నీకు ప్రేమంటే తెలుసా?" ఆయన ప్రశ్నించాడు.

"ఇప్పుడిప్పుడే తెలుస్తోంది. నిజమైన ప్రేమంటే ఏమిటో ఇప్పుడిప్పుడే తెలుస్తోంది" తడి కళ్ళతో రోజ్ నవ్వుతూ చెప్పింది.

**(వచ్చేనెల మరో కథ)**

Post your comments